# తప్పు

## జెట్టిగుండ్ల రఘునాథరెడ్డి



నూర్రూపాయలు తప్పు కట్టాల్నె -

యాణ్నించి తెచ్చి కట్టాల? యెవరిస్తారు? అసలీ నూర్రూపాయలే పుట్టించుకొనే తాహతే వుంటే తానెందుకీ దొంగ పని చేస్తాడు? గడువేమో మూడుదినాలుందింక. కట్టకపోతే రెడ్డిగారు ప్రాణాలతో వొదుల్తాడా? చెమ్డాతోలు వొల్చేసి పిల్లా జెల్లాతో తరిమేయడూ? అప్పుడు తన

గతేం కావాలి?.... తలచుకొంటున్నకొద్దీ గుండెలు తావుల్లో లేకుండాపోతున్నాయి పులిగాడికి.

ఓప్రక్క యీ భయం రాచపుండులా పీడిస్తుంటే ఆ పుండుమీది యీగల్లా ఊళ్ళోవాళ్ళంతా తనని ఓ గజదొంగ క్రింద జమకట్టి ఈసడింపుగా చూస్తుంటే ప్రాణం ఎగిసిపోతోంది వాడికి. వీధిలో తలెత్తుకు తిరగలేకపోతున్నాడు. తిండి లేకపోతే మలమలా మాడైనా చచ్చి వుండాల్సింది గానీ యీ పాడు పని మాత్రం చేసివుండకూడదు. ఇన్ని కష్టాలు నెత్తిన వేసుకొని వుండగూడదు. చెడ్డ టయాలు కాకుంటే ఏనాడు చేయని దొంగ పని చేయడానికి బుద్ధెట్లా పుట్టింది?

చిన్న చిన్న చేపల్లా దాదాపు ముప్పై పాకలదాకా వున్న రెడ్డిపల్లె కంతా ఒకటే మేడ. చిన్న చేపల్నంతా తిని తెగబలిసిన పెద్ద చేపలా వున్న ఆ మేడ కుబేరరెడ్డిగారిది. ఊరంత స్థలాన్ని కడుపులో యిముడ్చుకుని ఊళ్ళోవాళ్ళ గాలి సోకితేనే పంచమహాపాతకాలు చుట్టుకొంటాయన్నట్లుగా పల్లెకు పది బారల దూరంలో వుంది ఆ మేడ. ఊరి చుట్టుపక్కల వున్న భూముల్లో వంద ఎ క రా ల దా కా కుబేరరెడ్డిగారిదే. మారాజులు సుష్ఠుగాగా తినగా ఎంగి లాకుల్లో మిగిల్చిన మెతుకుల్లా తక్కిన కాస్తో కూస్తో భూమి ఒకరిద్దరిదీ. ఆ ఒక రిద్దరు తప్పితే మిగిలినవాళ్ళంతా రెడ్డిగారి పొలాల్లో కూలీనాలీ చేసుకొని బ్రతికే వాళ్ళే. అలాంటివాళ్ళల్లో పులిగాడూ ఒకడు.

ముసలితనపు ముసుగులా ఎడతెగని రోగాలతో మంచాన పడివున్న తల్లీ, పెళ్లాం, ముగ్గురు పిల్లలూ పులిగాడి కుటుంబం. ఇంతమందీ కేవలం ఒక్కని రెక్కలమీదే బ్రతకడం కష్టమని పెళ్లాం పాపులమ్మ కూడా పులిగాడితోబాటు పనులకు పోతుందేది. ఇద్దరి కష్టం తిండీ గుడ్డలకే అంటీముట్టక సరిపోగా రోగిష్టి తల్లి మందులకు అప్పుడప్పుడూ అప్పుల తిప్పల్లో పడేవాడు పులిగాడు.

వాళ్ళ బ్రతుకు లిలా కుంటి నడక నడుస్తుంటే –

పులిగాడిమీద కత్తిగట్టివ వాన నన్నటి జల్లులతో ఆరంభమై అంతై యింతై వటుడింతైనట్లు కుంభవృష్టిగా మారింది.


కూలీ కరవై పోయింది పులిగాడికి.

పొయ్యిలో పిల్లి కూర్చొంది.

ఆ కాడికి యిరుగింటా పొరుగింటా అప్పుచేసి యింట్లోవాళ్ళు పస్తులుండ కుండా కలో గంజో కాచుకున్నారు రెండు మూడు నాళ్ళు.

నాలుగోరోజు ఎంత బ్రతిమిలాడినా అది కూడా దొరికింది కాదు.

సముద్రంలో ఎక్కడో భీభత్సంగా తుఫాను చెలరేగిందని యిప్పట్లో తగ్గే సూచనలు కానరావడం లేదని – రేడియో వార్త!




నిలువునా నీరైపోయాడు పులిగాడు.

ఒక్కరోజుకే బీటి ఎండకు దెబ్బతిన్న చెరకు మొక్కల్లా పిల్లలు ఆకలికి తట్టుకోలేక మొహాలు వేలాడేసుకొన్నారు. మూర్ఛపోయినట్లుగా తల్లి పడుకొంది. ఇంకొన్ని దినాలు వర్షం యిట్లే వుంటే వీళ్ళంతా ఏంకాను?.... హృదయం రంపపుకోతగా వుంది వాడికి.

రెడ్డోరి కాడికి పోతే?

ఇన్ని బత్తెం నూక యిప్పించుకొస్తే?

— ఏదో లీలగా ఆశ.

చేసిన కష్టం యివ్వటానికే ఆయన గారికి చేతులు రావు. ఒకటికి రెండు తడవలు తిరగందే యివ్వడు. తేరగా యిమ్మంటే యిస్తాడా?....

— నిట్టూర్పుతో నిండిన నిరాశ.

"ఏం మావా! రెడ్డోరికాడికి పోయి నూకలో రూకలో యిప్పించుకొని రాక పోతే బిడ్డలు అన్నేయంగా సచ్చి పోతారు. మనమైతే మంచినీళ్ళు తాగైనా వుంటాం. పసిబిడ్డలు ఎట్లా వుంటారు?" పెళ్ళాం పాపలు అడుగంటిన ఆశకు ప్రాణంపోస్తూ అంది.

అంతకన్నా గత్యంతరం మరేమీ లేకపోవడంవల్ల పైగుడ్డ ఎత్తి భుజాన వేసుకొని కుచేలుడిలా కుబేరరెడ్డిగారింటికి బయల్దేరాడు, పులిగాడు.

ఐదారు కార్లు దాకా రెడ్డిగారి గేటు ముందు నిలబడివున్నాయి.

వాటిని చూస్తూనే క్రుంగిపోయాడు పులిగాడు.

అప్పుడప్పుడూ పెద్దోళ్ళు అట్లాంటి కార్లలో వస్తుంటారు. అతిధిసత్కారంలో పడి హడావుడిగా వుంటాడు రెడ్డిగారు. దర్శనం దొరకడమే గగనం.

నిరాశగా గేటుకాడనుంచే వెను దిరిగాడు.

"ఒరేయ్ పులిగా!" ఏదో పనిమీద అప్పుడే బయటి కొచ్చిన కుబేరరెడ్డిగారు గట్టిగా కేకవేశారు.

చివాలున వెనుదిరిగి, ఏడుకొండల వాణ్ని చూసినట్లుగా అల్లంత దూరా న్నుంచే చేతులెత్తి దండాలు పెడుతూ పోయాడు పులిగాడు.

"లోపల పుల్లాకులున్నాయ్. వాటి నంతా తీసి బయట పారెయ్!" సేవకుణ్ణి మహారాజు ఆజ్ఞాపించినట్లుగా అని, మళ్ళీ లోపలికే వెళ్ళిపోయారు రెడ్డిగారు.

ఎంగిలాకుల్ని సమీపించాడు పులి గాడు. ఎంతెంతో అన్నం వృధాగా వొదిలిపెట్టబడి వుంది. సగం సగం కొరికి వొదిలేసిన నేతి వంటకాలన్నీ శీలం చెడిన కన్నెపిల్లల్లా ఏడుస్తున్నాయి ఆకుల్లో.

ఈ అన్నంమీది ఆశతోనే గదా అక్కడ తనవాళ్ళంతా మొహం వాచి చస్తున్నారు?

ఈ అన్నంమీది రోతతోనే గదా యిక్కడివాళ్ళంతా మొహం మొత్తి చస్తున్నారు?

రెక్కలు ముక్కలు చేసుకొని కష్టి స్తున్న తనకేమో గంజికూడా కరువు!

ఎండ కన్నెరగకుండా కాలుమీద కాలేసుకొని వున్న వీళ్ళకేమో పాయసా న్నాలు కూడా బరువు!

ఎంగిలాకుల్లోని అన్నంలాంటి తన బ్రతుకును తల్చుకుంటుంటే వాడి హృదయం బాధగా మూల్గింది.

అందాకా బిక్కచచ్చివున్న షేగు లన్నీ అన్నం చూసేసరికి మేతకు పోయి వచ్చిన గోమాతను చూసి అరిచే లేగదూడలా అంబా అన్నాయ్.

ఆకుల్తో పాటే ఆ ఎంగిలి కూటినంతా తినేయాలనిపించింది.

తల్లీ, పెళ్ళాం, పిల్లలూ వాడి కళ్ళల్లో మెదిలేసరికి నాలుకలో నాడులన్నీ మొద్దు బారిపోయాయి. పుల్లాకుల్నంతా తీసు కొని బయటికొచ్చాడు. క్రింద పైగుడ్డ పరిచి ఆకుల్లోని అన్నమంతా జవిరి పోసాడు. 'ఓరీ నీ ఆశ అడుగంటిపోను, కూలీ సాకుతో అయిన డబ్బునంతా వెట్టికి కొట్టుకుపోతుండేది చాలక యిది కూడానా? ఛీ! ఛీ!.... ముందా అన్నం తీసుకెళ్ళి కుడితిలో కుమ్మరించి రా!' రెడ్డిగారి భార్య వొచ్చి గజ్జికుక్కను చీదరించుకొన్నట్లుగా అంది.

దొంగతనం చేయబోయి పట్టుబడిన వాడిలా తలొంచుకొని అమ్మగారు చెప్పి నట్లుగా చేయక తప్పింది కాదు.

మాంసపు ముక్కను వాగులో జార విడుచుకొన్న కుక్కలా బిక్కమొగ మేసుకొని గేటుకాడి కొచ్చి నిల్చున్నాడు పులిగాడు - రెడ్డిగారి దర్శనార్థం.

రాక్షసులు పచ్చి నరమాంసం తిన్న ట్లుగా నోటినిండా తాంబూలాలు నములుతూ

భుక్తాయసంతో కడుపుల్ని మందగమనాన మోయలేక మోసుకొంటూ వొచ్చిన అతిథులతో బాటు బయటి కొచ్చేరు కుబేర రెడ్డిగారు. కనీసం వాడివైపు కన్నెత్తైనా చూడకుండా వాళ్ళతోటే కారులో తుర్రుమన్నారు.

పులిగాడి కడుపు నిండకపోగా, కారు రేపిన దుమ్ముతో కళ్ళు నిండాయి.

గుమ్మాని కానుకొని కళ్ళల్లో ఆశల వొత్తులు ఎగదోసుకొంటూ తనకోసం ఎదురుచూస్తున్న భార్యను చూసేసరికి కళ్ళల్లో నీళ్ళు కమ్ముకొచ్చాయి_వాడికి. యుద్ధంలో పారి వెనుదిరిగి వొచ్చిన మనుమసిద్ధిలా మొహం వాల్చుకొని నట్టింట్లో కొచ్చి కుతికిలబడ్డాడు, పులిగాడు.

"పోనీలే మాఁవా! మన దరిద్రం అట్లా వుంది. దానికి ఏం చేస్తాం? మళ్ళీ రేపు చూదొచ్చులే!" సంగతి తెలుసు కున్నాక పులిగాణ్ని ఓదార్చింది పాపులు.

ఆ రాత్రి కంటిమీద రెప్ప పడలేదు వాడికి. ఎప్పుడు తెల్లారుతుందా, రెడ్డిగారి ఇంటికి పోబోతామా? యిన్ని నూకలు పుట్టించుకోబోతామా? అన్న ఆలోచనల్తో కూడిన ఆదుర్దాతో ఆ రాత్రంతా శివరాత్రిలా జాగరణ చేశాడు. వాడి బాధను చూడలేకనే కాబోలు రాత్రి భళ్ళున తెల్లవారింది.

ఆ ప్రొద్దున్నే లేచి ముక్కోటి దేవుళ్ళనీ స్మరించుకొంటూ రెడ్డిగారి దగ్గరికి పోయాడు పులిగాడు.

జూదంలో సర్వస్వాన్ని పోగొట్టు కొన్న ధర్మజునిలా మొహం వేలాడేసు కొని వున్నాడు కుబేరరెడ్డిగారు, వడ్ల గరిసెముందునిలబడి. ముగ్గురు మనుషులు గరిసె మెత్తు విప్పుతున్నారు.

వర్షంవల్ల రెడ్డిగారి చెరువంత గరిసె ల్లోని ఒక గరిసెలోకి ఎలాగో నెమ్మె క్కేసింది. వడ్లంతా పనికిరాకుండా ముగ్గిపోయాయి. ఆ బాధతో రెడ్డిగా రలా దిగులుపడి వున్నాడు_పాపం.

పులిగాడు కూడా సాక్షాత్తు కుబేరరెడ్డి గారిలా బాధపడిపోతూ, వడ్లు తోడుతున్న వాళ్ళతో తనూ చేతులు కలిపాడు.

పని పూర్తి అయ్యాక పైగుడ్డతో ముఖం తుడుచుకొంటూ_"అయ్యగారూ!" అన్నాడు వినమ్రంగా నిలబడి.

ఏమిట్రా నీ సొద?_విసుగ్గా మొహం చిట్లిస్తూ చూశాడు రెడ్డిగారు.

"ఏమీలేదయ్యగారూ .... యింట్లో నూకల్లేక పిల్లలు పస్తులు పడి వున్నారు. కాసిన్ని నూకలు ...."

"గరిసె గరిసెంతా పాడై పోయి నేను ఏడుస్తుంటే నీకు నూక లివ్వాలట్రా! నూకల్లేవు గీకల్లేవు; పో! పో!" కస్సు మన్నాడు రెడ్డిగారు.

"మూడ్రోజు లయిందయ్యగారూ, ఎవరు పెట్టి...."

"ఇన్నాళ్ళూ సంపాదించిందంతా ఏ

ఏట్లో వేళావట్రా, యిప్పుడు ఎనట్లోకి లేదంటున్నావు?"

తన పరిస్థితి రెడ్డిగారికి తెలియందేమీ కాదు. తమ యిద్దరి కష్టంతో బత్తెమే కొంటాడా? గుడ్డా గుసురే తెచ్చుకొంటాడా? తల్లికి మందూ మాకులే కొని పెడతాడా? అర్ధరూపాయి ఆదాయమైతే రూపాయి ఖర్చు ...రెడ్డిగారలా మాట్లాడటం పులిగాడి మనసు కెంతో కష్టమేసింది.

"తమరు దయపెట్టాల - లేకపోతే బిడ్డలు చచ్చిపోతారు"చివరి ఆయుధంలా ప్రయోగించాడు-వాడు.

"ఈ బుద్ధి అప్పుడేమయ్యిందిరా? వచ్చే ఆదాయం ఏ రోజు కారోజు జల్సా చేస్తుంటే చావరూ మరి! చస్తారో బ్రతుకతారో యిప్పుడు నన్నేమీ మాట్లాడించకుండా పో!" విక్కచ్చిగా తేల్చి చెప్పేశాడు యిక ఫలితం లేదన్నట్లుగా.

కాసంతైనా దయలేనోడు! రాక్షసుల్లో పుట్టాల్సినోడు! పొరబాటున ఆ దేవుడు మనుషుల్లో పుట్టించాడు! తనలాంటి బిడ్డలు ఆయనకు లేరూ? పస్తులన్నా పట్టించుకొన్నాడు కాదు. గొడ్డు మనిషి... వాడిలో ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చింది. పేదవాడి కోపం పెదవికే చేటు కనుక ఆ కోపాన్నంతా దిగమ్రింగి వెనుదిరిగాడు పులిగాడు.

ఇంటికి పోవటానికి బుద్ధికాలేదు.

మెల్లగా నడుచుకొంటూ ఊరి కవతలగా వున్న గుట్టమీద కూర్చొన్నాడు. తన అప్రయోజకత్వానికీ, నిస్సహాయతకూ ఏడ్పు పుట్టుకొస్తోంది.

ఎవరిమీదో పగ, ద్వేషం, కసి, కోపం పొగలు రేపుతున్నాయి. జుత్తు పీక్కున్నాడు. భోరుమని ఏడ్చుకొన్నాడు. సాయంకాలం అవుతున్నా అక్కణ్నించి కదలలేకపోయాడు-పులిగాడు.

వాడి బ్రతుకున అవరించిన దారిద్ర్యం లాంటి చీకట్లు క్రమ క్రమంగా లోకాన్ని మింగేస్తున్నాయ్.


వాడిలోని ఆశల్లాంటి వెలుగులు క్రమేణా అంతరించిపోతున్నాయ్. బాధల్లాంటి చలి ఎముకల్ని కొరికేస్తోంది.

పులిగాడి కడుపులోని ప్రేగుల అరుపుల్లా ఆకాశంలో ఉరుముల గోల!

ఆకలిమంటల్లా మెరుపుల జ్వాల!

ఉన్నట్లుండి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

చివాలున లేచాడు. చరచరా ఇంటికి పోయాడు. ఓ గోనెసంచీ నెత్తినవేసుకొని అర్ధరాత్రి వేళ నక్కలబండవైపు నడిచాడు. అక్కడ కుబేరరెడ్డిగారి వరి కుప్ప వుంది. వర్షంవల్ల కొత్తగా తాలు కొట్టిన వడ్లు ఎండబోయటానికి కుప్ప దోసి కప్పి వున్నారు. పక్కనే తాటాకుల గుడిసె క్రింద కావలివాడు గురక తీస్తున్నాడు. సద్దూ చప్పుడు లేకుండా గోనెసంచి నిండుకూ వడ్లు ఎత్తుకొని నెత్తిన పెట్టుకొన్నాడు. ఇల్లలుకగానే



పండుగ కాదన్నట్లుగా దొంగతనాన్ని పసి కట్టిన కావలివాడి కుక్క భౌ భౌ మంది.

కావలివాడు దిగ్గున లేచాడు. పులిగాణ్ని పట్టుకొన్నాడు. తక్షణమే రెడ్డిగారి దగ్గరికి లాక్కుపోయాడు.

"నా ఉప్పు పులుసూ తింటూ నాకే ఎసరు పెడ్తావట్రా?" విస్ఫులింగాలు వెదజల్లుతున్నట్లున్నాయ్ రెడ్డిగారి కళ్ళు.

భజనగుడి రాగిమానుకు కట్టివేయబడ్డ పులిగాణ్ని చింతబరికెలతో చితకబాదేడు కుబేరరెడ్డిగారు.

ఇంటికో మనిషి వొచ్చి పంచాయితీలో కూర్చొన్నారు.

పులిగాడికి నూరు రూపాయలు తప్పు పడింది.

వారందినాలు గడువిచ్చి వొదిలేశారు.

ఇదే యిప్పుడు వాడికొచ్చిన సమస్య. ఒకటి కాదు, రెండు కాదు నూరు రూపాయలు కట్టాల. నాలుగురోజులుగా సుడిగుండంలో చిక్కుకొన్నవాడిలా గిలగిలా కొట్టుకుంటున్నాడు. ఇంక ముందున్నది మూడురోజులు మాత్రమే!

రోజులు ఒక్కొక్కటే దొర్లిపోతుంటే, చావు దగ్గిరి కొస్తున్నట్లే వుంది వాడికి!

ఈ గండం గడిచే దెట్లా?

రెడ్డిగారి కాళ్లమీదే పడితే?

ఈ తడవకు మన్నించమని అడుక్కుంటే?....

"ఏ ముఖం పెట్టుకొని వొచ్చావట్రా దొంగ నా కొడకా!" పులిగాణ్ని చూసీ చూడగానే విషం వుమ్మే పాములా ఖాండ్రించి ఉమ్మాడు రెడ్డిగారు.

"బుద్ధి గడ్డి తిని చేసినాను అయ్యా గారూ! ఇంకెప్పుడూ ఇట్లాంటి పనులు

చేయను. ఈమారు దయపెట్టాల" కాళ్ళ మీద పడి దీనాతిదీనంగా వేడుకొన్నాడు.

"అంటే-నీ తప్పు తీసెయ్యమంటావు. ఆ పప్పులేం ఉడకవు. నీ తల తాకట్టు పెట్టైనా సరే తెచ్చి కట్టాల్సిందే!"

"తమరు ఎరగందేమీకాదు నా స్థితి."

"నీ నక్క-వినయాలు అవతల కట్టి పెట్రా' ముందు తప్పు కట్టి ఆపైన ఏదైనా మాట్లాడు" ఆ మాటతో బాటు లోపలి కెళ్ళిపోయాడు, రెడ్డిగారు.

మరణదండన తప్పదని నిర్ణయించు కొన్న ముద్దాయిలా బైటికొచ్చాడు పులిగాడు

బైట గేటువార బొమ్మలలో ఆడు కొంటూంది రెడ్డిగారి చిన్నకూతురు మూడేళ్ళ బేబీ. పులిగాడి కళ్ళు జిగేలు మన్నాయ్ - బేబీ మెడలోని బంగారు లాకెట్ చూసి.

ఆ చైను లాక్కొని పారిపోతే?....
బాధలేకుండా తప్పు కట్టెయ్యొచ్చు!
ఈ గండం నుంచి బయటపడవచ్చు!

—క్షణకాలం ఆలోచించాడు. ఆలో చించిందే తడవుగా అటూఇటూ చూశాడు. అదృష్టంకొద్దీ ఎవ్వరూ లేరు. వెంటనే చేతులతో బేబీ చైను లాగేసుకొన్నాడు.

కేర్‌మని ఏడ్చింది బేబీ పులిని చూసి నట్లుగా పులిగాణ్ని చూసి.

ఆ ఏడుపుకి ఇంట్లోవాళ్ళంతా పరుగెత్తు కొచ్చారు బయటికి పిరికిపందలా పరుగు లంకించుకున్నాడు పులిగాడు - చేతిలో చైనుంచుకొని.

రెడ్డిగారు ఊరంతా దద్దరిల్లే లా కేక లేశారు.

రెడ్డిగారి కేకలకు ఊళ్లోవాళ్ళంతా వొచ్చి పారిపోతున్న పులిగాణ్ని తరిమి తరిమి పట్టుకొన్నారు. పెడరెక్కలు విరిచి రెడ్డిగారి పాదాలముందు పడేశారు. పులిగాడి సగం ప్రాణం దాకా తీసేశాడు కుబేరరెడ్డి కసి దీరా కొట్టి. అంతటితో వొదలడం యిష్టంలేక పోలీస్‌స్టేషన్‌కు కబురెట్టాడు.

నిముషాల్లో సైకిళ్ళపై పరుగు పరుగున వొచ్చారు పోలీసులు. స్టేషన్‌కు పట్టుకెళ్ళారు పులిగాణ్ని.

పోలీసులు చితకబాదుతూంటే "నేను దొంగను కాదు సామీ! ఈ తప్పు నాది కాదు సామీ!" అంటూ గోలు గోలున ఏడ్చాడు పులిగాడు.

అయితే వాడి మాటల్లోని సత్యాన్ని గురించి ఆలోచించే వివేకం మనుషుల్లో వుంటే కదా?